

# బురుజువీధి కథలు

- కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# సంగీత ప్రేమ

**ఆరోజు** మా ఆఫీసుకు పైన్నుంచి అధికారులు వచ్చివెళ్లడంతో నేనింటికి రావడం బాగా ఆలస్యమై మా బురుజువీధిలోకి నేను తిరిగేసరికి రాత్రి పదకొండు దాటింది. సాయంత్రమే వర్షంపడి కరెంటు పోయింది. వీధిమొదట్లో బురుజుకు మరోవైపున్న కచేరిసత్రంలో బిచ్చగాళ్లు సన్నని గొంతుకలతో జీవితానుభవాల గురించి మాట్లాడుకుంటూ నిద్రకుపక్రమిస్తున్నారు.

పూర్వకాలంలో మాది రాజవీధట, ఎవర్నైనా రానిచ్చేముందు కచేరిసత్రంలో తనిఖీచేసి పంపేవాళ్లట. ఆతరువాత దాని యాజమాన్యంమీద దశాబ్దాలుగా కోర్టు కేసులుండడంతో అది పాడుబడి బిచ్చగాళ్లనిలయంగా స్థిరపడింది. అందులో దొంగలుకూడా ఉంటున్నారని మావీధిపెద్దలు ఫిర్యాదుచేసినప్పుడంతా పోలీసులు అక్కడున్నవాళ్లని వెళ్లగొడుతూంటారు, మళ్లీ మామూలే. ఐతే, 'రాజులకాలంలోనే అక్కడ ప్రజల్ని దోచుకునే లంచగొండ్లుండేవాళ్లని, ఇప్పుడే అది నిజమైన ప్రజాసేవ చేస్తోం'దని మా ఎదురింటి చలపతి అంటాడు.

'కేసులుతేలి అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ కడితే, దొంగలభయం తప్పుతుందేమో' అనుకుంటూ మాఇంటివైపు నడుస్తూ ధనరాజ్ ఇంటిదగ్గరకొచ్చాను. మావీధిలో అది మావరసలో అంటే కచేరిసత్రం లైన్లో నాలుగోయిల్లు. అన్నిటికన్నా దివ్యమైన భవంతి అదే. అతను పెద్దవ్యాపారస్తుడు, ఊళ్లోని ధనవంతుల్లో ఒకడు. మావీధి సంక్షేమసంఘ సభ్యుడు, ధర్మరక్షణకోసం ప్రాణమిస్తాడు. రాత్రిలైట్లలో వెలిగిపోయే అతని ఇల్లు, కరెంటులేని చీకట్లో మసగ్గా కనిపిస్తోంది. వాళ్లింటిముందున్న దిరిశెనచెట్టు కిందికొచ్చాను. చిమ్మచీకట్లో రోడ్డు తెలియడంలేదు. నేను ఆగి మొబైల్ బయటికి తీసి లైటు వెలిగించాను.

సరిగ్గా అప్పుడే నాముందు ధనరాజ్ ప్రహరీగోడలో పనిమనుషులువాడే సైడుతలుపు కొద్దిగా తెరుచుకుని ఒకరు తల బైటికిపెట్టి అటుఇటూ చూసారు. వెంటనే ఒక ఆకారం చేతిలో ఒక సంచీతో బయటికొచ్చింది. నేను "యెవరది?" అన్నాను.

ఆ సన్నటిఆకారం ఉలిక్కిపడి సంచి నేలమీదికి వదిలేసి నావైపు తిరిగింది. నేను ఆ ఆకారంమీదికి లైటు ఫోకస్ చేసాను.

పాతికేళ్ల యువకుడు, మొహం తెలిసినట్టేవుంది, కాని గుర్తుపట్టలేకపోయాను.

అతను దొంగ కాకపోవచ్చనుకుని, నేనెవరో అతనికి తెలిసేట్టు ఒకసారి లైటు నామొహంవైపు తిప్పి "యెవరు నువ్వు? యీటైంలో యెందుకొస్తున్నావు?" అనడిగాను.

అతనేదో చెప్పబోయేంతలో "అతను మామనిషే, వెళ్లనివ్వండి సూర్యం అంకుల్" అన్న మృదువైన ఆడగొంతు తలుపులోంచి వినబడింది.

నేనాశ్చర్యపోయి లైటు తలుపువైపు తిప్పాను. ధనరాజ్ చిన్నకూతురు శ్రీవల్లి బతిమాలుతున్నట్టు మొహం పెట్టి అక్కడ నిలబడివుంది. నేనేదో చెప్పబోయాను.

"రేపు నేను మీయింటికొచ్చి అన్నీ చెప్తా. యిప్పుడతన్ని వెళ్లనివ్వండి" అంది దీనంగా మొహంపెట్టి.

"సరే వెళ్లు" అని నేను అనగానే అతను సంచీ తీసుకొని బురుజువైపు వెళ్లిపోయాడు. పైన తలుపు మూసుకుంది. నేను ఇంటిదారి పట్టాను.

మరోరెండిళ్లుదాటి మాయిల్లు చేరేసరికి అతను 'జీత్ మల్' అని గుర్తొచ్చింది. అదేకాక ఆరాత్రి ధనరాజ్ ఇంట్లో ఎవరూలేరని, టౌన్లో చుట్టాలింట్లో పెళ్లికెళ్లారనికూడా గుర్తొచ్చింది. ఈమాట మా ఆవిడ కామేశ్వరి పొద్దున ఫలహారంచేస్తూండగా చెప్పింది. ఐతే శ్రీవల్లి పెళ్లికి వెళ్లలేదన్నమాట. 'ఈ రాత్రిసమయంలో జీత్ మల్ ఎందుకొచ్చాడో' అనుకున్నా.

మరుసట్రోజు పొద్దున్నే కాఫీతాగుతున్నప్పుడు కామేశ్వరితో రాత్రి చూసింది చెప్పాను.

"జీత్ మల్ అంటే సన్నగా, పాలిపోయినట్టుంటాడు. గుళ్లో ప్రతి సోమవారం భజనలు పాడతాడు. మంచి శ్రావ్యమైన గొంతు. ఆకుర్రాడేనా?" అంది, పెద్దగా ఆశ్చర్యపడకుండా.

"అతనే. వాళ్లది గుజరాత్. బరోడాలో వాళ్లకుటుంబానికి ఎలెక్ట్రికల్ సామాన్ల పంపిణీ వ్యాపారముంది. యితనిక్కడ వాళ్లయేజెన్సి చూసుకుంటాడు. డబ్బున్నవాళ్లేమీ కాదు. నెమ్మదైన వాడు. అతనికి అంతరాత్రిపూట ధనరాజింట్లో యేంపనో?" అన్నాను

"వల్లి వచ్చి అన్నీ చెబుతానందిగా? యింకెందుకూ బుర్ర చెడగొట్టుకోవడం?"

"నిజంగా వస్తుందంటావా? అప్పుడేదో తప్పించుకోవడానికి అలా చెప్పింటుంది"

"వల్లి వాళ్లింట్లో అందర్లోకి నిఖార్సైన పిల్ల. స్వతంత్ర వ్యక్తిత్వమున్న మనిషి. మనం చిన్నప్పట్నుంచి తెలుసు. తప్పకుండా వస్తుంది" అంది కామేశ్వరి లేచి లోపలికెళ్తూ.

'సంఘం నిర్దేశించిందానికి భిన్నంగా ఏమనిషి ప్రవర్తించినా అది ఇతరుల్లో ఆసక్తిని, అనుమానాన్ని రేకెత్తిస్తుంది. సంఘనిర్మాణం పాక్షికంగా కూలినా కొన్నిఇటుకలు తమమీద కూడా పడతాయని భయం కాబోలు' అనుకున్నా. ఆరోజు ఆఫీసులో జీత్ మల్ గురించి ఆరా తీశాను. అతను జైన్ మతస్తుడని, హిందుస్తానీ సంగీతం గొప్పగా పాడతాడని, గుర్తింపులేక యిలాగున్నాడని చెప్పారు. 'అతను సంగీతంపిచ్చితో వ్యాపారాన్ని నిర్లక్ష్యం చేయడంవల్ల ఇక్కడి ఏజెన్సి మూసేసేస్థితిలోవుంద'ని తీర్పుకూడా ఇచ్చారు.

సాయంత్రం కామేశ్వరికివన్నీ చెప్పి "వల్లి అతనికి ధనసహాయం చేస్తూందంటావా? అతనితో యేం అనుబంధముందని అంతభారం తలకెత్తుంటుంది?" అనడిగాను

"వూళ్లో అతనెక్కడపాడినా వల్లి హాజరౌతుందని విన్నా. విషయమేంటో ఆపిల్లనే అడుగు. నేనేదన్నా చెప్తే మనవీధి 'వార్తల వనజమ్మ' చేరవేసిన సమాచారమా అంటావు" అంది కవ్వింపుగా నవ్వి.

రాత్రి మావీధి సద్దుమణిగాక వల్లి మాయింటికొచ్చింది. బజారునుంచి వస్తున్నట్టుంది, చేతుల్లో కొత్తబట్టలు, సామాన్ల సంచులున్నాయి. హైద్రాబాదులో పీజీలో చేరుతున్నట్టు చెప్పింది. 'రాత్రి విషయం' ప్రస్తావిస్తూ "అతన్ని దొంగేమో అనుకున్నా" అన్నాను.

"జీతూ, నేను ప్రేమించుకుంటున్నాం. పెళ్లి చేసుకోబోతున్నాం" అంది వల్లి.

రాత్రి జీత్ మల్ని అక్కడ చూడ్డంకంటే ఈమాటకు ఎక్కువ ఆశ్చర్యపోయాన్నేను.

"మీ యింట్లోవాళ్లు వొప్పుకోరుగా" అంది కామేశ్వరి.

ఔనంటూ తల ఊపింది వల్లి.

"అతన్ని గురించి పూర్తిగా తెలుసుకునే యీ నిర్ణయం తీసుకున్నావా" అడిగాను.

"ప్రేమించాక వివరాలు తెలుసుకున్నా, నిర్ణయంలో మార్పురాలేదు" అంది నవ్వుతూ.

"మరేంచేద్దామనుకుంటున్నావు? రహస్యంకాకపోతేనే చెప్పు" అంది కామేశ్వరి.

"రహస్యమే. నిన్నరాత్రి అంకుల్ నన్నూ అతన్నీ చూసారు. పొరపాటుతో యీవిషయం మానాన్నకు చేరితే నా ప్లాన్లన్నీ దెబ్బతినడమేకాక, జీతూకు ప్రమాదం. అందుకే మీరీవిషయాన్ని మర్చిపోవాలని అభ్యర్థించడానికొచ్చాను" అంది.

నేను 'ధనరాజ్ కుటుంబప్రతిష్టకు ఇచ్చే విలువ, పట్టుదల గురించిచెప్పి, అతనికి కూతురు వల్లి అంటే ఎంతప్రేమో వివరించి, జీత్ మల్ దగ్గర సంగీతంతప్ప మరేమీలేదని గుర్తుచేసి, మరోసారి అలోచించుకో'మన్నాను.

"నీకు ఈవిషయంలో సొంతనిర్ణయం తీసుకునే హక్కువున్నా ప్రేమగా పెంచిపెద్దచేసిన తల్లిదండ్రులకు ఒక అవకాశమివ్వడంకూడా న్యాయమేగదా" సూచించింది కామేశ్వరి.

ఆమె ఆలోచనలో పడి, "యీ మాటే జీతూకూడా చెప్తున్నాడు. కాని మానాన్న సంగతి తెలిసుకాబట్టి, రహస్యంగా పెళ్లిచేసుకుందామని నేనే జీతుమీద వొత్తిడి తెస్తున్నాను" అంది.

నేనూ కామేశ్వరి సూచనను బలపరిచాను. మరికొంతసేపు చర్చ నడిచింది.

ఆమె మెత్తబడి "మా అసలుప్లాను ప్రకారం జీతు యిక్కడి వ్యవహారాలన్నీ ముగించుకుని యీ ఆదివారం బరోడా వెళ్లిపోతాడు. నేను పీజిలో చేరడానికి హైద్రాబాదు వెళ్తాను. అతను పెళ్లికి యేర్పాట్లు చేసాక నేను బరోడా వెళ్తాను"

అని నవ్వి "సరే నాకూ మీరుచెప్పింది వొకవిధంగా కరెక్టే అనిపిస్తోంది. హైద్రాబాదు వెళ్లాక మాఅమ్మా నాన్నలతో మాట్లాడతాను, వాళ్లు వొప్పుకోకపోతే మా అసలుప్లాను వుండనేవుంది" అంది.

"తొందరేముంది? మీరు స్థిరపడినతరువాత చేసుకోవచ్చుగదా?" అడిగింది కామేశ్వరి.

"మాకు తెలిసినవాళ్లల్లో యెవరు ప్రేమవివాహం చేసుకున్నా ఆరోజు మా నాన్న అప్సెట్ అయ్యేవాడు. యీ మధ్యనే మా నాన్న నాపెళ్లి నిర్ణయించేసాడు. పెళ్లవగానే నేను పీజి మానెయ్యాలని యిరుపక్షాలు నిర్ణయించి ముహూర్తాలు చూస్తున్నారు. అంతా సినిమాల్లో లాగే" అని నవ్వి లేచి ముందుగదిలోకి నడిచి "పెళ్లిఖర్చులకు అవసరమైతే తాకట్టుపెట్టమని రాత్రి నా వజ్రాలనగలు జీతుకిచ్చాను..." అని తలుపుగొళ్లెం తీస్తూ ఆగింది.

"అతను బరోడా వెళ్లాక నిన్ను పిలువకపోతే" అన్నాను ఆందోళనగా

"పిలవకపోతే అప్పుడు నగలే పోయుండేవి. కానీ జీతు నా నగలు తీసుకోలేదు, రాత్రి అతను పట్టుకెళ్లిన సంచిలో నా పెళ్లిబట్టలే వున్నాయి" అంది, వీధితలుపు తీస్తూ వెనక్కితిరిగి.

నేను తొందరపడి మాట్లాడినందుకు సిగ్గుపడ్డాను. కామేశ్వరి నవ్వేసి పరిస్థితిని తేలికపర్చింది.

వారంతర్వాత వల్లి హైదరాబాదుకు, జీత్ మల్ బరోడాకు వెళ్లినట్టు వల్లిద్వారానే తెలిసింది.

"ఆడవాళ్లు తెలివైనవాళ్లంటావు, యీపిల్ల అతన్నెలా ప్రేమించిందో" అన్నా.

"వల్లి తన నిర్ణయం కేవలం భావోద్వేగంతో తీసుకున్నదని అనుకోలేం. ఆలోచించి కూడా తీసుకొనివుండొచ్చు. అతన్ని 'పండిట్ జీత మల్, పద్మభూషణ్ గ్రహీత'ని చేస్తుందేమో" అంది కామేశ్వరి నవ్వి.

రెండువారాలు గడిచాక ధనరాజ్ ఇంట్లో గొడవలు జరుగుతున్నట్టు మా ఆవిడకు మావీధి ఆడవాళ్ల నెట్ వర్క్ ద్వారా తెలిసింది, దాన్ని 'వార్తల వనజమ్మ' ధ్రువపరిచింది.

"హైదరాబాదునుంచి తల్లిదండ్రులకు తన ప్రేమవిషయం చెప్పిందట వల్లి. ధనరాజ్ వొప్పుకోలేదట. వల్లి హాస్టల్లో లేదట. యెక్కడుందో తెల్సుకోవడానికి రహస్యంగా ప్రయత్నిస్తున్నారట" అంది కామేశ్వరి.

"మనసలహా పాటించినట్టేవుంది. యిద్దరూ యేదోవొక రాజీకొస్తారనుకుంటా" అన్నా.

రెండ్రోజులపోయాక ఆరోజురాత్రి తొమ్మిదిన్నరకి ధనరాజ్ ఇంటికి రమ్మని నాకు, చలపతికి కబురొచ్చింది. విషయం గోపనీయమని, ఇంట్లోవాళ్లక్కూడా తెలియరాదని చెప్పారు.

తొమ్మిదింపావుకి నేను ఇంటినుంచి బయటికొచ్చి మాయెదురింటి చలపతి వచ్చేదాకా వేచివున్నాను. వీధిలో జనసంచారం లేదు. నదికవతలివైపున్న మూసేసిన జూట్ మిల్లు చీకట్లో ఆకాశంలో కల్సిపోయింది. నదివొడ్డునున్న గుడిమూయడంలో పూజారికి సాయంచేసి మావీధి 'పరోపకారి పాండురంగ' ఇంటికెళ్తున్నాడు.

చలపతి రాగానే అతనికి శ్రీవల్లి విషయంలో జరిగిందంతా క్లుప్తంగా చెప్పాను. తరువాత మేమిద్దరం ధనరాజ్ ఇంటికెళ్లాము.

మేం వెళ్లేసరికి ప్రధానసభ్యులంతా వచ్చివున్నారు. తక్కువకాంతిలో, చిన్న గొంతులతో చర్చిస్తున్నారు. ధనరాజ్ మొహంలో, కోపము, అవమానమేకాక బాధకూడా కనిపిస్తోంది. అతని శ్రీమతి భాగ్యలక్ష్మి పక్కనేవుంది. ఆమె అంతకుముందు ఏడ్చినట్టుగా మొహంమీద కన్నీటి చారికలున్నాయి.

కాస్సేపు చర్చించాక, మావీధి మాపెద్దలందరికీ చాలావిషయాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. ధనరాజ్ కు చాలా అన్యాయం జరిగిందని, ఎంతో ప్రేమతో పెంచుకున్న చిన్నకూతురు ఇలా తల్లిదండ్రులను ఖాతరు చెయ్యకపోవడం, అవమానానికి గురిచెయ్యడం దారుణమని, సమాజంలో పెడధోరణులవల్ల ధర్మహాని జరుగుతోందని, ఇందులో ఏదో కుట్రకూడావుందని, వాడు ఆస్తికోసమే ఈపని చేసాడని, పెళ్లికాలేదు కాబట్టి వల్లిని ఎలాగైనా ఇంటికి తీసుకురావాలన్న అభిప్రాయాలను అందరూ ఒప్పుకున్నారు.

ధనరాజ్ కలగజేసుకుని తనకు సరైన సలహాయివ్వాలని, ఈవిషయాన్ని రహస్యంగా ఉంచాలని, ఇంకా తాము నిర్ణయించిన పెళ్లికొడుకువాళ్లగ్గాని, చుట్టాలగ్గాని చెప్పలేదని వివరించి సంఘసభ్యులు తనకు అన్నివిధాలా సహాయపడాలని అభ్యర్థించాడు.

మళ్లీ చర్చ కొంతసేపు సాగిందిగాని ఏంచేయాలనే విషయంలో మా సంఘసభ్యుల్లో ఏకాభిప్రాయంకుదరక రెండువర్గాలుగా విడిపోయారు.

పోలీసు రిపోర్టిచ్చి, పలుకుబడి ఉపయోగించి రహస్యంగా వల్లి ఆచూకిని తెల్సుకుని ఇంటికి తీసుకొచ్చేలా చెయ్యాలని స్వామినాయుడు, బసవలింగం, సోమయాజులు సూచించారు.

నారాయణమూర్తి, మునిరెడ్డి, బంగార్రాజు దాన్ని బలపరచలేదు. శ్రీవల్లికి మైనారిటి తీరిందని, పోలీసులు ఆమెను బలవంతంగా తీసుకురాలేరని అన్నారు. తామే తమ పలుకుబడి ఉపయోగించి జీత్ మల్ కుటుంబాన్ని ఆశపెడితేనో, బెదిరిస్తేనో సమస్య పరిష్కారమౌతుందని అభిప్రాయపడ్డారు.

“వధూవరుల పరస్పర అంగీకారంతోనే వివాహం జరపాలని మన మూల ధర్మశాస్త్రాలు చెప్తున్నాయి” అని కాశీనాథ్ అన్నాడుగాని ఎవరూ దాన్ని పట్టించుకోలేదు

“వల్లి అలావెళ్లిపోవడం తప్పే. యిది మనసుకు సంబంధించింది. యింతవరకూ వచ్చాక వాళ్లని విడదీయడం మంచిదికాదు. పంతాలు యింకాపెరుగుతాయి. ధనరాజ్ వాళ్లు వొప్పుకోగలరేమో ఆలోచించాలి. లేదా ఆవిషయం వల్లికి చెప్పేసి ఆమెదారినామెను వొదిలేసి యిక వూరుకుంటే అఘాయిత్యాలు, అవమానాలు తప్పుతాయి" అన్నాడు చలపతి.

నేను చలపతిని బలపరిచాను. ఐతే మా అభిప్రాయం ఎవరికీ నచ్చలేదు.

"వొప్పుకుంటే యిక సమాజంలో క్రమశిక్షణ ఉండదు. మనమంతా వొక సంఘంగా కలిసుండడంలో అర్థముండదు. సంప్రదాయాన్ని పాటించడంలోనే మన మర్యాదస్తుల బలము, గౌరవమూ వున్నాయి. యిది యేవొక్కరి సమస్యో కాదు. రేప్పొద్దున అందరికీ యిబ్బందే" రంగశాయి హెచ్చరించాడు. సభ్యులందరూ 'అంతే' అన్న భావప్రదర్శనతో తలవూపారు.

"అట్లాంటివాణ్ణా ప్రేమించేది? మాక్కాబోయే వియ్యంకులది జిల్లాలోనే గౌరవమైన కుటుంబం. వాళ్లకెంత అవమానం. వాళ్లనెట్లా సముదాయించాల?" అన్నాడు ధనరాజ్.

ఎవరేవిధంగా సహాయం చెయ్యగలరో ఆలోచించుకొని మరుసటిరోజు రాత్రి తొమ్మిదికి రహస్యంగా అక్కడే కలిసి, ముందుకెళ్లడానికి ఒక మార్గాన్ని నిర్దేశించుకోవాలని చివరికి నిర్ణయించారు.

మరుసటిరోజు సమావేశానికి నాకు, చలపతికి ఆహ్వానం రాలేదు. ఆరోజు కూడా సమావేశంలో ఏకాభిప్రాయం తేలలేదని తెలిసింది.

ఇక ఎవరూ చేసేదేమీ లేదని, వల్లి ఎవరికీ తెలియకుండా బరోడావెళ్లి పెళ్లి చేసుకుంటుందని నిర్ధారించుకొని మేము మా పనుల్లో పడిపోయాము.

ఆ రెండోరోజురాత్రి నేను నిద్రకుపక్రమిస్తుండగా చలపతి, ధనరాజ్, భాగ్యలక్ష్మి మాయింటికి వచ్చారు. ఇది అనుకోని పరిణామం. హాల్లో కూర్చున్నాం. ఇంట్లో నేనొక్కణ్ణే ఉన్నాను. కామేశ్వరి వాళ్లపిన్నికి బాగలేదంటే హైద్రాబాదు వెళ్లింది.

"అలోచిస్తే వాళ్లకు మన సలహా నచ్చిందట. మనతో విడిగా మాట్లాడ్డానికొచ్చారు" అన్నాడు చలపతి. 'యిందులో భాగ్యలక్ష్మి ఒత్తిడి ఎక్కువున్నట్టుంది' అనుకున్నాను.

"మాక్కాబోయిన వియ్యంకులతో యెట్లాగో చెప్పినా. 'ముందే తెలిసింది మేలైంది, మేమీసంబంధం వొదులుకుంటున్నాము' అని వాళ్లు గౌరవంగా చెప్పినారు. గొప్ప సంబంధం పోయింది. సరే, మా చుట్టాలకెట్లో చెప్పుకుంటామనుకోండి. ఐనా యీ ప్రేమలెట్లా యేర్పడతాయో అర్థంకాదు. వాణ్ణి చూస్తే యెందుకూ తరంగాడు, బికారి. పైగా వేరేమతమంట" అన్నాడు విచారంగా.

"అతను చాలా బాగా పాడతాడు. భవిష్యత్తులో పేరున్న విద్వాంసుడౌతాడు" అన్నాను.

ధనరాజ్ ఒకసారి అరచేత్తో నుదురు కొట్టుకున్నాడు.

"పెద్దవాళ్లగా యిక మాకు తప్పడంలేదు. మేమొప్పుకుంటున్నట్టు వల్లికి చెప్పాం" అంది భాగ్యలక్ష్మి. ధనరాజ్ తలవూపాడు.

చలపతి కల్పించుకుని "ప్రస్తుత పరిస్తితుల్లో పెళ్లి యిక్కడ చెయ్యలేరట. పిల్లలెలాగూ ఆగరుకాబట్టి యిప్పటికి వాళ్లను బరోడాలోనే చేసుకోమని చెప్తున్నారు. పెళ్లికి ధనరాజ్ కుటుంబమొక్కటే వెళ్తుంది. యిక్కడంతా సద్దుమణిగాక రిసెప్షన్ పెట్టుకుంటారట" అన్నాడు

"మేము పెళ్లికిముందొకసారి హైద్రాబాదులో వల్లిని కలిసి, ఆమె నగలు, డబ్బు, పెళ్లిసామాన్లు యిస్తామని చెప్పాము" అని, నుదురు కొట్టుకొని "మామాటలను వల్లి నమ్మడంలేదు. చూసారా తల్లి, తండ్రి మాటలే పిల్లలు నమ్మని స్థితివొచ్చింది" అన్నాడు ధనరాజ్ ఇబ్బందిగా.

"మీరు మొదట్లోనే మీ అమ్మాయిని విశ్వాసంలోకి తీసుకొనివుంటే యీపరిస్థితొచ్చేది కాదుగా" అన్నాను. ఈసారి భాగ్యలక్ష్మి తలవూపింది.

"నువ్వే సాయం చెయ్యాలి సూర్యం" అని "నువ్వుగాని, చలపతిగాని వచ్చేట్టైతేనే కలుస్తానంది వల్లి. మమ్మల్ని నేరుగా పెళ్లికే రమ్మంది. చలపతికి వెళ్లడానికి కుదర్దంలేదు. నువ్వు శ్రమఅనుకోకుండ రెండుమూడ్రోజుల్లో హైదరాబాదెళ్లి వల్లికివి యిచ్చిరావాలి. మాతరపున నువ్వూ కామేశ్వరి వెళ్లండి. ఆమె అక్కడేవుందటగా" అన్నాడు.

నేను 'సరే'నన్నాను.

ధనరాజ్ తనుతెచ్చిన బ్యాగ్ తీసి, శ్రీవల్లి నగలు, డబ్బు, అప్పటికే వాళ్లుచూసిన సంబంధంకోసం కొన్న పెళ్లివస్తువులు, పట్టుచీరలు అన్నీ చూపించి వాటిలెక్కవున్న చీటీ నాచేతిలో పెట్టాడు.

తరువాత ధన్యవాదాలు చెప్పి వెళ్లిపోయారు. నేను కామేశ్వరికి ఫోన్ చేసి జరిగిందంతా వివరించి ప్రశాంతంగా నిద్రపోయాను.

ఆ ఆదివారం సాయంత్రం కామేశ్వరి, నేను హైద్రాబాదులో ఒకహోటల్లో వల్లిని కలిశాం. ఒకమూల టేబులుదగ్గర కూర్చున్నాం. జనం పెద్దగాలేరు.

"నిజంగా మీరు మంచిసలహా యివ్వబట్టి యిలా జరిగింది. లేకపోతే మా అమ్మానాన్నా నన్నెప్పటికి క్షమించివుండేవాళ్లు కాదు" అంది వల్లి కళ్లలో తడితో.

"నీ స్వతంత్రాన్ని నువ్వు వుపయోగించుకోవడంలో తప్పులేదుకాని అది వీలైనంత కన్నవాళ్లతో ఘర్షణలేకుండావుంటే మంచిదికదా" అంది కామేశ్వరి ఆమె భుజంమీద చేయివేసి.

"పెద్దవాళ్లమీద సమాజం వొత్తిడివుంటుంది. వాళ్లకు వ్యవధి యిస్తే అన్నీ సర్దుకుంటాయి" అని "మీ అమ్మానాన్నా యిచ్చిన నీ నగలు, పెళ్లివస్తువులు, డబ్బు తీసుకో" అని ధనరాజ్ ఇచ్చిన బ్యాగ్ ఇచ్చాను.

వల్లి తీసి చూసి, పెళ్లివస్తువులు మాత్రం తీసుకుని తన బ్యాక్ ప్యాక్ లో పెట్టుకుంది. తన నగలు, డబ్బు తిరిగి ఆ బ్యాగ్ లో పెట్టి నాకు వాపసు ఇస్తూ "నేను జీతూని ప్రేమించినప్పుడే పేదరికానిక్కూడా సిద్ధపడ్డాను. యిప్పటివరకు నా

జీవితంలో ఖరీదైన బట్టలు, నగలు, పార్టీలు తప్ప మరేమీ లేవంకుల్. మానాన్న చూసిన పెళ్లిసంబంధంలో అవే యింకా నాలుగింతలున్నాయి. అవంటే నాకు భయం" అంది.

కామేశ్వరి ఆమెనగలు తీసి మళ్లీ ఆమెకిస్తూ "యివి నీవి, వుంచుకో. ఆపత్సమయానికి పనికొస్తాయి. అవసరంలో యెవరిదగ్గరికెళ్లినా తక్కువగా చూస్తారు" అని వల్లి చేతిలో ఆప్యాకెట్ ఉంచింది. వల్లి ఈసారేమి మాట్లాడకుండా దాన్ని తన బ్యాక్ ప్యాక్ లో పెట్టుకుంది.

మట్లాడుకుంటూ అక్కడే డిన్నర్ చేసి ముగ్గరం బయటికొచ్చాము. చల్లగాలి వీస్తోంది. కామేశ్వరి మాకు క్యాబ్ బుక్ చేసింది. వల్లి తన ఫ్రెండుబైకులో వచ్చింది.

"మీనాన్న డబ్బును తీసుకోవచ్చుగదా, కొత్తసంసారమంటే ఖర్చు లుంటాయి" అన్నా, 'ఈపిల్లలో ఇంత పరిణితి ఎలావచ్చిందో, కొందరికి సహజంగా వస్తుందేమో' అనుకుంటూ.

"వొక చిన్న కుటుంబానికి యెంతకావాలి అంకుల్, ప్రస్తుతం మేమిద్దరం బతకడానికి మనవీధి రామారావుగారమ్మాయి రేవతక్క నాకు వుద్యోగం యిప్పిస్తానంది. జీతు తన సమయాన్ని పూర్తిగా సంగీతం ప్రాక్టీసుకు వినియోగిస్తాడు" అంది వల్లి.

కామేశ్వరి ముందుకెళ్లి రోడ్డుపక్కన ఆగుతున్న క్యాబుల్లో మా క్యాబ్ కోసం చూస్తోంది.

"డబ్బు, నగలు, పార్టీలు వీటిమీద విరక్తి చెందావుసరే, సంగీతంతప్ప అతనికేమీ లేదుకదా? అతనిలో యేం చూసి ప్రేమించావు?" అనడిగాను.

"వున్నదొక్కటే జీవితం, కష్టనష్టాలున్నాయని మనకు నచ్చినదారిని వొదిలేస్తామా? నాకు చిన్నప్పట్నుంచి సంగీతమంటే ప్రాణం. స్వానుభవంతో చెప్తున్నాను. జీతూ గానంలో అద్భుతమైన నాదముంది. లోపలెక్కడోవున్న ప్రాణానికి శాంతిని, హాయిని కలిగించే శక్తివుంది. అతనింకేమీ చెయ్యఖ్ఖర్లేదు, పాడుతూంటే చాలు. మిగతావన్నీ నేనే చూసుకుంటాను. నేను వూహాలోకంలో లేను, యిది భౌతిక మైన నిజం" అంది.

ఆ ఇరవైయేళ్ల పిల్ల తన జీవితం గురించి ఆలోచిస్తున్న విధానం నాకు అర్థంకావడానికి నాకు కొంత సమయం పట్టింది. ఇంతలో మా క్యాబ్ రావడంతో వల్లికి శుభాకాంక్షలు చెప్పి కారెక్కాము.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments